నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 16 ఏప్రిల్ 2024 | NAGARKURNOOL

రైతులు, నాయకులతో కలిసి జలదీక్ష చేపడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కళ్లు తెరిపించడానికే జలదీక్ష

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, ఏప్రిల్ 15 : నడిగడ్డకు కూతవేటు దూరంలో కృష్ణా-తుంగభద్రా నదులు ప్రవహిస్తున్నా.. కాంగ్రెస్ పాలనలో నడిగడ్డ ప్రజలు తాగు, సాగునీటి కోసం గోస పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా మొద్దు నిద్రపోతున్నదని, వీరి కళ్లు తెరిపించడానికి జలదీక్ష చేపట్టినట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. గద్వాల ప్రజల దాహార్తిని తీర్చడానికి కర్ణాటకలోని నారాయణపూర్ డ్యాం నుంచి ఐదు టీఎంసీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే బండ్ల సోమవారం జలదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా ఈ నాలుగేండ్లల్లో మరిన్ని ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మీ కోసం మీ తాగునీటి సమస్య తీర్చడానికే తాను ఈ జలదీక్ష చేపట్టానన్నారు. గద్వాల ప్రజల తాగునీటి సమస్య తీరే వరకు పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. రైతులు, ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలిచ్చి మోసం చేసిందని, వారికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఇన్‌చార్జి అభిలాష్‌రావు, ఎంపీపీలు ప్రతాప్‌గౌడ్, రాజారెడ్డి, విజయ్‌కుమార్, జెడ్పీటీసీలు పద్మ, రాజశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, సరోజనమ్మరమేశ్‌నాయుడు, కౌన్సిలర్లు నాగిరెడ్డి, దౌలు, శ్రీనివాసులు, మురళి, నాయకులు కృష్ణారెడ్డి, వెంకట్రాములు, రామన్‌గౌడ్, ఉమాదేవి, రాధాకృష్ణారెడ్డి, హనుమంతు నాయుడు, వెంకటేశ్, బాబర్, గోవిందు, సాయి శ్యాంరెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేవరకు వెంటాడుతాం..

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు మోసపోయారు. వాటిని అమలుచేసేవరకు సర్కారును వెంటాడుతూనే ఉంటాం. ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు గోస పడుతున్నారు. పదేండ్లల్లో ఎప్పుడూ సాగు, తాగునీటి కోసం దీక్షలు చేసిన సంఘటనలు లేవు. గద్వాలలో 70 ఏండ్లల్లో జరుగని అభివృద్ధి పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసి చూపించింది. రాష్ట్ర ప్రజలు పుట్టెడు దుఃఖంతో అలమటిస్తున్నారు. ఒక్క జోగుళాంబ గద్వాల జిల్లాలోనే 2,500 ఎకరాల పంట నష్టం జరిగినా.. అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదు. రైతులకు రుణమాఫీ ఎప్పుడు అమలు చేస్తారో వివరించాలి. నడిగడ్డలో 99 శాతం ఓట్లు కారుగుర్తుకే వేయాలి. కొందరు దొంగలు, స్వార్థపరులు పార్టీని వదిలి వెళ్లిపోయి ద్రోహులుగా మిగిలిపోయారు. కాంగ్రెస్ అంటేనే ప్రజలను దోచుకుంటుంది. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలి.

- శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి

కోస్గిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తన్నీరు హరీశ్‌రావు

హామీల అమలుకు పోరాడుదాం

- బీజేపీ, కాంగ్రెస్‌లు ఏం చేశాయో చెప్పాలి:హ రీశ్‌రావు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కోస్గి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు పోరాడుదామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికలపై కోస్గిలోని లక్ష్మీనర్సింహ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రధాన ప్రతిపక్షంగా హామీల అమలుకు పోరాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఓడినా, గెలిచినా మనం ప్రజలవైపే ఉండాలన్నారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిందని, మరి బీజేపీ ఏం చేసిందో ప్రజలకు వివరించాలన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి బీజేపీ సర్కారు పేదల నడ్డి విరిచిందని, 20 కోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పి 6 లక్షలు కూడా ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. చెప్పుకోడానికి పథకాలు లేవు కనుక చిత్రపటాలు, అక్షింతలు, చీరలు పంచుతున్నారని ఎద్దేవా చేశారు. ఆరునెలల్లో పూర్తి కావాల్సిన కరివెన ప్రాజెక్టును పూర్తి చేయకుండా రేవంత్ ప్రభుత్వం టెండర్లు రద్దు చేసిందని మండిపడ్డారు. కొడంగల్‌లో ప్రజలు తాగునీటి కోసం పడుతున్న కష్టాల గురించి వార్తలు రాస్తే జర్నలిస్టులకు బెదిరింపులు వస్తున్నాయన్నారు. ఆసరా పింఛన్ రూ.4 వేలు ఇస్తామని అవ్వాతాతలను, నెలకు రూ. 2500 ఇస్తామని మహిళలను మోసం చేశారన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లడగడానికి వస్తే నాలుగు నెలలకు కలిపి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయమని ప్రజలకు సూచించారు. ముఖ్యంగా నిరుద్యోగులకు రూ.4 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని సీఎం రేవంత్ అంటే.. అసలు ఆ హామీనే ఇవ్వలేదని డిప్యూటీ సీఎం అసెంబ్లీ సాక్షిగా చెబుతున్నాడని దుయ్యబట్టారు. హామీలు అమలు చేయడం చేతగాక ఎన్నికల కోడ్ అడ్డం పెట్టుకుంటున్నారు. హకీంపేట, ఎర్రంపల్లి వంటి నాలుగు గ్రామాల రైతుల భూములను ఫార్మా కంపెనీ కోసం లాక్కుంటున్నారన్నారు. పొల్యూషన్ కంపెనీ మాకొద్దని ప్రజలు అంటున్నా పట్టించుకోవడం లేదని, వారి భూముల జోలికి వచ్చినా, కార్యకర్తలను వేధించినా ఊరుకోమని హెచ్చరించారు. కాంగ్రెస్ మెడలు వంచి హామీలను అమలు చేయాలంటే మన్నెను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య యాదవ్, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నాయకులు సలీం, శాసం రామకృష్ణ, బాలరాజు, మహిపాల్, వెంకట్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి, వేదికపై ఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యేలు ఆల, చిట్టెం, రాజేందర్‌రెడ్డి

ఆరు గ్యారెంటీలతో చిమ్మచీకటే..

- జాతీయ పార్టీలతోఅ భివృద్ధి శూన్యం : మాజీమ ంత్రినిరం జన్‌రెడ్డి

కొత్తకోట, ఏప్రిల్ 15 : ఆరు గ్యారెంటీలను నమ్మి కాంగ్రెస్‌కు ఓటేసి చిమ్మచీకటి చేసుకున్నారని, ఇంకోసారి అలాంటి తప్పు చేయొద్దని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. సోమవారం కొత్తకోటలోని బీపీఆర్ గార్డెన్‌లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో చిమ్మచీకట్లో ఉన్న విద్యుత్‌ను దశల వారీగా 24గంటల విద్యుత్, సాగు నీరు అందించిన ఘనత కేసీఆర్‌దే అని అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక కొత్త ప్రాజెక్టు, రైల్వే లైన్, ఎన్ఐటీ కాలేజీలు లేవన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఒక్క గ్యారెంటీతోనే భార్యకు భర్తకు మధ్య గొడవలు సృష్టించారన్నారు. అంబేద్కర్‌కు కాంగ్రెస్సేతర ప్రభుత్వమే భారతరత్న ఇచ్చిందని, అంబేద్కర్ రెండు సార్లు పోటీ చేస్తే కాంగ్రెస్ పార్టీయే ఓడించిందని గుర్తు చేశారు. బీజేపీ మత చిచ్చులను రెచ్చగొట్టిందని, బడా నాయకులకు బ్యాంకులను కొల్లగొట్టి ధనికులను చేసిందని అలాంటి పార్టీని నమ్ముద్దన్నారు. మూడు నల్ల చట్టాలతో 1100 మంది రైతులను హత్య చేసింది మోదీ ప్రభుత్వమే అని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కసితో పని చేయాలని, పాత నీరు పోయిన కొత్త నీరుతో ఉత్సాహంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ మాని క, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, నాయకులు జయమ్మ, పద్మ, సంధ్య, నాగన్నసాగర్, ప్రశాంత్, అయ్యన్న, కొండారెడ్డి, ఖాజామైనుద్దీన్, తిరుపతయ్య, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ గొంతును పార్లమెంట్‌లో వినిపిస్తా..

ఆరు గ్యారెంటీలతో సీఎం రేవంత్‌రెడ్డి గారడీ చేస్తున్నారు. నడిగడ్డ ప్రజల దాహం తీర్చడానికి ఎమ్మెల్యే బండ్ల ప్రాణాలను సైతం లెక్కచేయకుండా జలదీక్ష చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇక్కడి కాంగ్రెస్ నేతలు కర్ణాటక నుంచి డబ్బులు తెచ్చి ఎమ్మెల్యేను ఓడించడానికి ప్రయత్నించారు. మిగతా వ్యాపకాలపై ఉన్న శ్రద్ధ ప్రజల దాహార్తిని తీర్చడంలో లేదు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి నారాయణపూర్ నుంచి ఐదు టీఎంసీలను తరలించే వరకు పోరాడుతాం. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు పాలనను గాలికొదిలేసి ఏసీ గదుల్లో ఉన్నారు. మరికొందరేమో క్రికెట్ మ్యాచ్‌లు చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. కేంద్రం ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్ సమర్థవంతంగా తిప్పికొడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు నిజానికి, అబద్ధాల ముఖ్యమంత్రి రేవంత్‌కు మధ్య జరుగుతున్నాయి. నిజాయితీగా చెప్పినవన్నీ అమలు చేసిన బీఆర్ఎస్‌కు ప్రజలు ఓటు వేస్తారో.. అబద్ధపు మాటలు చెప్పే కాంగ్రెస్‌కు ఓటు వేస్తారో తేల్చుకోవాలి. బీఆర్ఎస్‌కు ఓటేస్తే మీ గొంతును పార్లమెంట్‌లో వినిపిస్తా.

- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి



గద్వాలలో జరిగిన జలదీక్ష కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, రైతులు

మాట్లాడుతున్న హరీశ్‌రావు

కాంగ్రెస్‌వి ఉద్ధర మాటలు

'ఈ సర్కారు వద్దు' అంటున్న ప్రజలు, రైతులు

- నీటిని విడుదల చేయించడంలో నిర్లక్ష్య ధోరణి
- కర్ణాటకలో ఉన్నది కూడా మీ ప్రభుత్వమే కదా..
- ఎన్నికల్లో బుద్ధి చెప్పకుంటే ఐదేండ్లు మాట వినరు
- వంద రోజుల్లోనే 222 మంది అన్నదాతల ఆత్మహత్యలు
- సీఎం రేవంత్‌వి మాటలు ఎక్కువ.. చేతలు తక్కువ..
- ఓట్లు దండుకునేందుకు బీజేపీ మొసలి కన్నీరు
- ప్రేమ ఉంటే 'పాలమూరు'కు జాతీయ హోదా ఇవ్వాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

గద్వాల, ఏప్రిల్ 15 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో రేవంత్ సర్కారు పూర్తిగా విఫమైందని, హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు కర్రు కాల్చి వాత పెట్టాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్‌స్టాండ్‌లో తాగునీటి సమస్య తీర్చాలని డిమాండ్ చేస్తూ గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి జలదీక్ష చేపట్టగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సంఘీభావం తెలిపారు. ముందుగా ఎమ్మెల్యే బండ్లకు హరీశ్‌రావు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని అలాంటప్పుడు అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి నీటిని విడుదల చేయించాల్సిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపై నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ కళ్లు తెరిచి కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించే వరకు ఈ ఉద్యమాలు ఇలాగే కొనసాగుతాయన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు చెప్పిన మాటలు ఉద్దెర మాటలని తేలిపోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ ప్రజలకు ఉద్దెర మాటలు చెప్పాడే తప్పా ఏనాడూ వారిని ఉద్దరించాలనే ఆలోచన లేదన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో రేవంత్ సర్కారుకు ఓటు ద్వారా ప్రజలు బుద్ధి చెప్పకపోతే ఈ ఐదేండ్లు రేవంత్ ఇక మన మాట వినరని చెప్పారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నడిగడ్డ దాహార్తి తీర్చడానికి ఐదు టీఎంసీల నీటిని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రివి మాటలు ఎక్కువ చేతలు తక్కువని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు, ప్రజలు కరువుతో అల్లాడుతుంటే ముఖ్యమంత్రి పాలన గాలికి వదిలేసి ప్రతిపక్ష నాయకుల ఇండ్లకు వెళ్లి కండువాలు కప్పుతూ కాలం వెల్లదీస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రాష్ట్రాన్ని ఆగం చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలు వద్దురో కాంగ్రెస్ సర్కారు అంటున్నారని చెప్పారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ నీరు, కరెంట్ కోసం ఎవరూ దీక్షలు చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రాష్ట్రంలో 222మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో కిట్లు బంద్ తిట్లు ఫుల్ అన్నారు. అధికార కాంగ్రెస్ మొద్దు నిద్రపోతున్నదని, వారి కళ్లు తెరిపించడానికే జలదీక్ష చేపట్టారని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో గట్టు ఎత్తిపోతల పనులు ప్రారంభించామని దానిని పూర్తి చేసే వరకు పోరాడుతామని చెప్పారు. రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, టీడీపీలు పాలమూరు జిల్లాకు అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం చేశాయన్నారు. ప్రాజెక్టులన్నింటినీ పెండింగ్‌లో పెట్టగా కేసీఆర్ ప్రభుత్వం వాటిని ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసి ఆరున్నర లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చిందని గుర్తు చేశారు. గతంలో నెట్టెంపాడు ద్వారా 20వేల ఎకరాలకు నీరు పారడం గగనంగా ఉండగా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 1.4లక్షల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. గత ప్రభుత్వాలు రైతులకు ఆరు గంటల కరెంట్ ఇస్తే నాణ్యమైన 24 గంటల విద్యుత్ ఇచ్చామన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు, రైతుబీమా, ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడానికి గోదాంలు కట్టామన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ఒక్క హామీ అయినా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందా అని ఆయన ప్రశ్నించారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పారని, రూ.2లక్షలు రుణమాఫీ చేసి ఉంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని లేని పక్షంలో బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయాలని సూచించారు. మహిళలకు రూ.2500, వృద్ధులకు పింఛన్ రూ.నాలుగు వేలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గ్రామాల్లో ఓటు అడగానికి వచ్చిన వారిని ఈ విషయాలపై నిలదీయాలని ప్రజలను కోరారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా తులం బంగారు ఏమైందని ప్రశ్నించారు. గ్యారెంటీలతో కాంగ్రెస్ అందరినీ మోసం చేసిందని, ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క మాటను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి బీజేపీ రైతులపై మొసలి కన్నీరు కార్చుతుందని చెప్పారు. బీజేపీ ప్రవేశపెట్టిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమాలు చేస్తే 700 మందిని పొట్టన పెట్టుకున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు.

మోదీ, రేవంత్‌రెడ్డి ప్రజల సమస్యలు గాలికి వదిలేసి మా మీద పడ్డారని ఆరోపించారు. బీఆర్ఎస్‌ది రైతు ప్రభుత్వమన్నారు. మీఅందరి గొంతులు తడపడానికి కృష్ణానదీ జలాలను గద్వాలకు తీసుకురావడానికి మీ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఈ జలదీక్ష చేపట్టారని గద్వాలకు నీరు వచ్చేదాక పోరాటం కొనసాగిద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే బండ్లకు నిమ్మరసం తాగిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే విజయుడు, ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ప్రవీణ్

మీ సేవకుడిగా పనిచేస్తా..

మీ సేవకుడిగా.. మీ కోసం నిరంతరం పనిచేస్తా.. మరోసారి ఎంపీగా అవకాశం ఇవ్వండి. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి చిల్లర మాటలు మాట్లాడొద్దు. మా కంపెనీలో ఏటా 500 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాను. నువ్వు ప్రజలకు ఏం చేశావో చెప్పాలి. దీనిపై ఎక్కడైనా చర్చించేందుకు సిద్ధం. నేను పార్లమెంట్‌లో ఎన్ని సార్లు మాట్లాడానో నా రికార్డు చూడు. మీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మళ్లీ ఓట్లు ఎలా అడుగుతారు. రైతుల పంటలు ఎండిపోతున్నా.. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు నోరుమెదపడం లేదు. ఈ ప్రభుత్వం కేవలం కేసీఆర్, బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకొని, పరిపాలనను గాలికొదిలేసింది. బీజేపీ మతం పేరుతో రాజకీయం చేయాలని చూస్తున్నది. అయినా ప్రజలు వీరిని నమ్మే పరిస్థితి లేదు.

- మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి

మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, వేదికపై ఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యే చిట్టెం, అంజయ్యయాదవ్

గులాబీ జెండా ఎగరాలి

- కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు : శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, ఏప్రిల్ 15 : పాలమూరు గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగరాలని, ఎంపీగా మన్నె శ్రీనివాస్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం హన్వాడలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని, నేడు ఎంపీ ఎన్నికల్లో ప్రజలను మరోసారి మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నదని వాటిని నమ్మవద్దని సూచించారు. రాష్ట్రంలో ఎటుచూసినా పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నా.. గ్రామాల్లో ప్రజలు తాగునీటికి పడరాని పాట్లు పడుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన 125 రోజుల్లోనే ప్రజలకు చుక్కలు చూపిస్తున్నదని విమర్శించారు. రైతుబంధు సాయం రూ.15వేలు, కల్యాణలక్ష్మి సాయంతోపాటు తులం బంగారమని, ధాన్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అని చెప్పిన హామీలన్నీ ఎక్కడ పోయాయని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు చెప్పి గెలుపొందాలని చూస్తున్నాయని ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేదన్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలో హన్వాడ మండలంలో రెండు బీసీ గురుకులాలతోపాటు ఎస్సీ హాస్టల్ కూడా ఏర్పాటు చేశామని, మండలంలోని ఎంతో మందికి సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందించి ఆదుకున్నామని, ఎంపీ సైతం తన నిధుల నుంచి అభివృద్ధి పనులు చేశారని వివరించారు. మన ప్రభుత్వం లేకున్నా పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చే స్తామని హామీ ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి ఎమ్మెల్యే టికెట్‌ను అమ్ముకున్న కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి ఎంపీగా నిలబడి తనను గెలిపించాలని కోరడం సిగ్గుచేటన్నారు. ఎవరికి ఏ ఒక్క రోజు సాయం చేసిన వ్యక్తి కాదన్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులిద్దరూ నాన్‌లోకల్ క్యాండెట్లు అని.. మన్నె శ్రీనివాస్‌రెడ్డి లోకల్ అభ్యర్థి అని అన్నారు. కారు గుర్తుకు ఓటేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయకుండా కాలయాపన చేయడంతోపాటు తమ చేతగానితనాన్ని ఇతర పార్టీలపై రుద్దుతున్నదన్నారు. గొల్ల కురుమలు గొర్రెల కోసం డీడీలు కట్టినా.. గొర్రెల పంపిణీలో తాత్సారం ప్రదర్శిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శివకుమార్, జెడ్పీటీసీ విజయనిర్మల, వైస్ ఎంపీపీ లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్, వైస్ చైర్మన్ వెంకటయ్య, కృష్ణయ్యగౌడ్‌తోపాటు ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.